శరత్ చెప్పిన కథ

# పున్నంనాడు పొమ్మొక్కింది

సూరిశెట్టి సాంబశివరావు బాబ్జీ

—హావురాజిల్లాలో యుగకళ్యాణనే ఓ పెద్ద వూరుంది కాలంనాడీ వూళ్ళో కుర్రకారంతా యేటేటా కార్తీక పున్నంనాడు కాస్తో కూస్తో వాళ్ళ అంతస్థుకి తగ్గట్టు ఓ చిన్న మహాసభ జరిపించుతూండే వాళ్ళు మహాసభలో నాటక ప్రదర్శనం కూడా ఒహ టనుకొండి

ఆ యేడాది, అంటే పందొమ్మిదొందల ముప్ఫయొహట్లో నన్నమాట — రవీంద్రనాథ టాగూరుగారి 'వైకుంఠుని వీలునామా' నాటకాన్ని ప్రదర్శించాలనుకున్నారు అందు కగ్రాసనాధిపత్యం ఈ మాటు శరత్ బాబుకి కట్టబెట్టాలనికూడా నిర్ణయించుకున్నారు

ఈ 'యుగకళ్యాణ్' సమ్తాబేడ్ కించుమించు యిరవై కోసుళ్ళుంటుంది మహాసభరోజున మధ్యాహ్నం తన తమ్ముని కూతురు ఆయిదారేళ్ళ అమ్మాయిని వెంటబెట్టుకు పయనమయ్యాడు శరత్ బాబు వూరికి ఇంటినుంచి ఆరు కోసుళ్ళదూరం, అంటే దేవుల్టీనించి కటక్ రోడ్డుదాకా పల్లకీలోనూ — ఆ తర్వాత బాగ్నాన్ గుండా మోటార్లోనూ ప్రయాణంచేసి ఆయన యుగకళ్యాణ్ చేరుకున్నారు

అనుకున్న టయిముకల్లా నాటకం ఆరంభమయింది శరత్ బాబు రాత్రికి రాత్రే మళ్ళా యింటికి చేరుకోవాల్సుంది. అందుకని ఆయన తిరుగు ప్రయాణానికి వెసులుబాటుగా వుండాలన్న తలంపుతో బందోబస్తులన్నీ పకడ్బందీగా జరిగాయి కానైతే శరత్ బాబు తాలూకు చిన్నమ్మాయి వుందిగా ! ఆ అమ్మాయికి నాటకం పూర్తి కాకముందే యింటిమీద ధ్యాస పోయింది ఇహ అక్కణ్నుంచి చూసుకొండి "మా(వయ్యా మనం వెళ్ళిపోదాం పదా" అంటూ శరత్ బాబుని సతమతంపెట్టి సతాయించడం మొదలెట్టింది పాపం ఆయన మానాన అయన, నాటకం మాంచి రసపట్టులో వుందేమో— అసలీ ప్రపంచమే మరిచిపోయి దాన్ని చూసి ఆనందిస్తున్నాడు ఆపిల్ల గొణుగుడూ — సణుగుడుతో శరత్ బాబు మళ్ళా యీ లోకంలో పడ్డాడు టయిం కూడా అనుకున్న దానికన్న చాలా అయింది. ఇహ జాగుచేస్తే లాభంలేదు. అంత రాత్రి వేళప్పుడు ఆ చిన్నపిల్లను వెంటబెట్టుకుని యింటికి తిరిగి పోవడ(వంటే మాటలా మరి '— అందుకే ఆయన

కూడా ఆదరాబాదరాగా అక్కణ్నుంచి లేచి బయల్దేరాడు.

"బాబ్బాబూ, నాటకం యింకెంతో లేదు. అసలుఘట్టంలో పడింది. ఇంకొంచెం సేపట్లో మంగళం పాడేస్తాం. అందాకా ఆగండి" అంటూ సభ నేర్పాటు చేసిన పెద్దతలకాయ లన్నీ కోర్టులో సాక్షిని బ్రతిమాలినట్టు మరీ మరీ ప్రాధేయపడి వేడుకున్నారు.

"అబ్బే, అదికాదండీ, ఇంత రాత్రి గట్ల అంతదూరం యీ చిన్న పిల్లతో యిల్లు జేడుకోవాలి గదా!—అప్పుడే బయల్దేరకపోతే యెలా చెప్పండి. మీ డ్రైవ రెక్కడున్నాడో కాస్త పిలిపించి మమ్మల్ని దేవుల్టీకి దిగబెట్టిరమ్మని చెప్పే సెయ్యండి మీకు పుణ్యం వుంటుంది" అంటూ శరత్‌బాబు సైతం ఆత్రుత పడుతూ వాళ్ళకి నచ్చజెప్పి ఆఖరి కెలాగయితేనేం, 'సరే' ననిపించి వొప్పించాడు.

సరే. ఇహ తప్పుతుందా మరి!—వాళ్ళంతా వేరేగత్యంతరంలేక ఆడ్రైవరుకి కబురు పంపించారు. అతగాడేమో ఆ వూరివాడేకాని కాస్తదూరంగానే వుంది యిల్లు. 'ఇదిగో, యిప్పుడే పిలుచుకొస్తామండీ' అంటూ కొంతమంది అక్కణ్నుంచి అంచెలంచెల మీద బయల్దేరారు.

అసలె ఆ డ్రైవరిల్లు దూరం అందులోనూ అర్ధరాత్రి! అతగా డేం మత్తు నిద్దర్లో వున్నాడోమరి!—అంతకూ రాలేదు, ఇంతకూరాలేదు. శరత్ బాబెంత ఆరాట పడ్డాడో అంత లేటయింది. మరి కాస్సేపటి కింకా అతగాడు రాకపోగానే ఆయనకి విసుగూ—గాబరా రెండూ కలిగాయి. నిమిషనిమిషానికీ ఆ డ్రైవరు గురించి కనిపించిన గాడిదకొడుకు నల్లా వాకబు చెయ్యడంతోనే సరిపోయిం దాయనకి;—చూశాడు, చూశాడు. ఇహలాభం లేదని ఆయన తాటీకాయంత మొహాన్ని ఆవగింజంత చేసుకుని.—" నాకెప్పుడో తెలుసునయ్యా బాబూ, ఈ సభలూ, ఈ ఆర్భాటా లన్నీను; తీసుకొచ్చేప్పుడేమో అడుగులయినా క్రిందపడకుండా యెంతో మక్కువ వుట్టిపడేట్టు—మర్యాద మించి పోయేట్టు తీసుకొస్తారు. సభకాస్తా అయిపోగానే యెవడిమట్టుకి వాడు జారుకుని సభకి పెద్దగా వొచ్చినవాడి సంగతే పట్టించుకోరు. తీసుకొచ్చేప్పు డున్నంత జోరు తిరిగి పంపించేప్పు డుండదు. ఇదీ వీళ్ళ తంతు!" అంటూ కాస్త కటువుగానే మనసులో వున్న నాలుగు ముక్కలూ బయిటి కనేశాడు.

ఇంకొంచెం సేపటికల్లా 'బొంయి బొంయి'మని హారన్ మోగించుకుంటూ కారొచ్చి ఆగింది. శరత్‌బాబు దేవుల్టీ చేరుకునేప్పటికి రాత్రి సరిగ్గా పదిగంటలై పోయింది. అక్కడ ఆయనకని ఓ పల్లకీ అవ్రడీగా వుంది. చివరి కెలాగయితేనేం, చాలా రాత్రి గడిచింతర్వాత ఆయన యిల్లు చేరుకున్నా డనుకోండి.



''పయ్ ! గడ్డాయనా ! అమ్మేదేనా ? గడ్డి మంచిదేనా ?
“కాస్త తిని చూడండి బాబూ, మీకే తెలుస్తుంది.”

మర్నాడు పొద్దుట, తూరుపు తెల్లవార గానే యుగకళ్యాణ్ నించి యిద్దరు పెద్దలాయన యింటి కొచ్చారు. శరత్ బాబుకి నమస్కరించి, — “అయ్యా, అనుకున్నటయింకల్లా మోటారుకారు రాలేదని మీకు మామీద యెక్కడలేని కోపం వొచ్చిందని విన్నాం. మా వల్ల నిజంగా పొరపాటే జరిగింది. అందుకే మిమ్మల్ని క్షమాపణ వేడుకునిపోవాలని కాఫీయైనా త్రాక్కుండా మీదగ్గర కొచ్చేశాం. మమ్మల్ని మన్నించండి” అంటూ చెప్పుకున్నారు సవినయంగా —

అందుకు శరత్‌బాబు చిరాగ్గా అన్నాడు గదా, — “ఇదుగో. అయ్యా, నా కొచ్చిన కోపం అంతా యింతా కాదు. నిజమే ! మీపైని అంత కోపగించుకున్నందుకు తగిన శిక్ష కాస్తా దార్లోనే అనుభవించేశానులెండి”

ఈ మాట వినగానే ఆ పెద్దలమాం తంగా గాబరాపడ్డారు. “ఏంవిటయిం దండీ ? — శిక్షంటున్నారేంవిటీ ?” అంటూ ఆతృతపడి ఆయ న్నడిగారు.

“ఏం చెప్పను నాయనా, కార్లో మీ దగ్గర్నుండి బయలుదేరానా. దేవ్పురీ చేర కుని అక్కడ పల్లకీయెక్కి కూచున్నాం. అప్పటికప్పుడే సుమారు పది దాటి పోయింది. కొహో — కొహో మను కుంటూ సంగోరురస్తా చేరుకునేప్పటికో అఘాయిత్యం జరిగింది. మా పల్లకీ మోస్తున్న బోయీల్లో ఒకడేమో 'అమ్మ బాబోయ్, చచ్చా'నని అరుస్తూ హటాత్తుగా క్రింద పడిపోయాడు. ఆ యరుపు వినగానే రెండో బోయీ సైతం భయంతో బెంబేలు పడిపోతూ పల్లకీకాడి టపీమని భుజంపైనించి దించి భూమ్మీద కుదేశాడు.

అసలింతకూ యేం జరిగిందోనని బయటి కొచ్చి చూద్దునుగదా, 'అమ్మ బాబోయ్' అంటూ అరిచిన ఆసామీ భోరుమని యేడుస్తూ – " బాబయ్యా రచ్చించండి. పేనాలు పోతున్నాయ్ బాబూ, నన్ను పాంకాటేసిందండీ" అంటూ ఒకటే ఆవేదన పడుతూ గుండే నోరూ బాదుకొంటున్నాడు.

పాఁవన్నమాట చెవిని పడేసరికల్లా రెండోబోయీ ప్రాణాలుకూడా గాలి కెగిరిపోయాయి. వాడుకూడా 'అమ్మ నాయనోయ్' అంటూ అమాంతంగా కూలబడి పోయాడు. నాకేం చెయ్యడానికీ పాలుపోలేదు. అంత అర్ధరాత్రి గట్ల ఆ గడ్డినీట్లో యేంచెయ్యడం? – అప్పు డెక్కడికని పరుగెత్తుకెళ్ళడం? – ఏ డాక్టరున్నాడని అడగటం? – అసలా కరిచినపాము విషపునాగో, పెసరపామో, కట్లపామో, అదీ యిదీ కాకపోతే వొఠి నీటిపామో! – ఏఁవీ బోధపడటంలా – పాపం యింతకూ యేవూరివాడో అబోయీ – ఆ రాత్రి యేకుక్కల కొడు కెదురుచూసుకొచ్చాడో గాని ఆ మైదానం మధ్యని మందూ మాకూకయినా నోచుకో కుండా దిక్కుమాలినచావు చావాల్సొచ్చిం దనుకుని మహా మధనపడ్డాను.

అయితే వాళ్ళ పుణ్యమా అంటూ ఆ బోయీలదగ్గర ఓ చిన్న లాంతరుంది. ఆ లాంతరుకాస్తా అందుకుని నేనా బోయీ కాలిని పరిశీలించి పరీక్షగా పరకాయించి మరీ చూశాను. అదేదో మామూలు పురుగేదో కుట్టిన చిన్నవాపు కనిపించింది కానీ పాంకరిచినజాడ కలికంవేసి చూసినా కనబళ్ళేదు. ఇంతకూ ఆపాముని చూశావుట్రా అని వాణ్ణడిగాను.

"అబ్బే, లేదండయ్యాగోరూ, పాం కనిపించలేదండి. కానండి గానీ నన్ను కుట్టింది ముమ్మాటికీ పాఁవేబాబుగోరూ – అనుమానం ఆవగింజంతయినా అక్ఖర్లే దండి. ఆకాటు పడీపడంగానే నాకు మైకం కమ్మేసినాదంటే నమ్మండి. తుళ్ళి తుళ్ళి యెగిరిపడ్డానండి. అమ్మయ్యో, ఇయ్యేల నా గతేటి? – తఁవరే కాపాడాలి" అంటూ వాడు కుయ్యోమర్రోమని రాగాలు తియ్యడం మొదలెట్టాడు.

ఆ పాముని చూళ్ళేదని వాడెప్పుడైతే అన్నాడో నా కర్ధమైపోయింది వాణ్ణసలు పామేకుట్టలేదని; అంతవరకూ నాకున్న అనుమానం కాస్తా పటాపంచలై పోయింది. పైగా వాడివొంట్లో విష మెక్కిన లక్షణాలసలు ఆవగింజంతయినా అవుపించటం లేదాయిరి? –

"హోరి నీయిల్లు బంగారంకాను. ఎంత రగడజేశావ్. నిన్నసలు కుట్టింది పాం కాదురా మహానుభావా. ఏ బురదపురుగో కరిచిందల్లేవుంది. అంతే. మరేం భయ పడకు. నా మాటవిని మీ యేడుపులు మానండర్రా మీకు పుణ్యఁవుంటుంది" అంటూ వాళ్ళని తలకొట్టుకుని మరీ బ్రతిమిలాడాను.

అయినా ఆ గాడిదకొడుకు లోపట్టాన నామాట వినిపించు కుంటేనా ? — వాళ్ళ యేడుపులూ — మొత్తుకోళ్ళూ యింకా పైస్థాయి నందుకున్నాయి. ఒక్కుమ్మడిగా పెద్ద పెట్టున గోలపెట్టి "అమ్మోయ్ — బాబోయ్" అంటూ అక్కడే తిష్టేసుకుని చతికిలబడి పోయారు. "రచ్చించండి బాబుగోరూ రచ్చించండి" అంటూ తతిమా బోయీ సైతం పాం కుట్టిందని ఆపసోపాలు పడ్తున్న బోయీకి వంతపాట పాడ్తున్నాడు.

ఇహ ఆ యర్ధరాత్రికాడనేను పడ్డపాట్లు కుక్కలుకూడా పడవంటే నమ్మండి. నా గుండెల్లో గునపంతో దిమ్మిసా కొట్టి నంత బాధపడ్డా. మతిలేని మాటా సుతి లేని పాటా అని వాళ్ళ గావుకేకలకి సుద్దీ బద్దంలేదు. "ఒరేయ్ బాబ్బాబూ, షాఁవూ లేదు" గీఁవూలేదు. 'కాస్సేపు వూరు కొండర్రా అంటే ఒక గాడిదకొడుకూ నామాట వినరే ! — ఎం జెయ్యడం ?— సంగోరు రాత్రి పందెంవేసుకున్నట్టు పరు గెత్తి ముందుకి సాగిపోతుందాయెను ! — ఓవేపేమో ముసలాడి వెధవముండా సొద — మరోవేపు మా చిన్న పిల్ల సణుగుడు మేజువాణీ ! — రామ రామ — నాగుండె రెండు చెక్కలై పోయిందంటే నమ్మండి.

మరిగంటే మా వూరక్కణ్నుంచి కాస్తాకూస్తా దూరమా ?—ఇంకా బోలెడు దూరాన వుంది. ఏదో మొండికెత్తి కాలి నడకని జేరుకుందా మనుకున్నా కుదిరే వ్యవహారం కాదు. పైపెచ్చు అంత నడి రాత్రిని ఆ ముసలి పీనుగుల్ని వాళ్ళ ఖర్మానికి వాళ్ళని వొదిలిపెట్టి పోవడం కూడా యేఁవంత సబబుగా వుంటుంది. ఛా ఛా, ఏం జెయ్యడానికీ తోచక తిక మకపడి కాస్సేపాలోచిస్తూ కూచున్నా. ఆఖరి కోవుపాయం తళుక్కున మెదళ్లో మెరిసింది. దాంతో మహాధైర్యఁవున్న మొనగాడికిమల్లే పోజు ఫిరాయించి,— "ఒరేయ్ ఒరేయ్,అన్నట్టు నా మతిగూల, అడగడం మరిచేపోయాను. ఈవేళ తిథి యేంటర్రా ?" అంటూ నిబ్బరంగా అడిగాను.

ఇది విని వాళ్ళ యేడుపులు కాస్త స్వరం తగ్గించి "ఇయ్యాల పున్నవం డయ్యగోరూ'' అన్నారు టపీమని.

ఈ మాటకి నేను లేని ఆనందాన్ని కొనితెచ్చుకుని,—"అవుర్రోయ్. ఆ మాట నిజఁవే!— ఈవేళ పున్నంకదూ!—ఇంకేం, మరి బెంగన్నదే వుండక్కర్లా. ఇదిగో నా మాట కాస్త వినిపించుకొండర్రా బాబులూ ! నాకు వాక్స్థానంలో బృహ స్పతి వున్నాడు. అబద్ద మన్న దసలు రానేరాదు పున్నంనాడెలాటి విషప్పాము కరిసినా దాని విషం వొంటి కెక్కదు. ఈపాటి తెలివికూడా మీకు లేకపోతే యెల్లా చావడం ! కాస్త ఓపికపట్టి

చూడండి. పోనుపోను మీకే తెలుస్తుంది" అంటూ నాలుగు కోతలు కోసి వాళ్ళకి ధైర్యం చెప్పి వూరడించాను.

ఆఫళంగా వాళ్ళు కట్టలుతెగి వొస్తున్న యేడుపు తక్కున మానేసి నావంక కళ్లు వెల్లబెట్టి బేలగా చూడసాగారు. సందు దొరికిందే చాల్నాలని నేను మళ్ళీ వుపన్యాసం కాస్తా దంచేశాను. "అవ్వ- ఈ సంగతి యీ వేళ పుట్టిన పసిగుడ్డుకి సైతం తెలుస్తుంది గదా! — అలాంటిది మీకు తెలియదుట్రా వెర్రినాగమ్మలూ ?— అమావాస్యనాడూ, పున్నంనాడూ పాముల కసలు విషమే వుండదు. అదెంత విషనా గైనా సరే, యీ రెండు తిథులనాడూ కలికానికయినా విష మన్నది వుండనే వుండదు. ఉత్తపుణ్యాని కిద్దై పోతా రేంటి? ఇహ లేవండి. ఫర్వాలేదు. పల్లకీ లేవ దియ్యండి. ఇదుగో, నేనసలు సిసలు పంతుల్ని. పుస్తకాలు రాసుకుని బతికే వాణ్ణి. రాత్రనక, పగలనక పంచాంగాలూ, పుస్తకాలూ చదివి చదివి జీవిత మంతా గడిపేసిన బ్రాహ్మణ్ణి. నా మాట నమ్మి యిక్కణ్నుంచి కదలండిరా నాయనలారా" అంటూ నయాన నాలుగు మాటలుచెప్పి అఖరి కెలాగై తేనేం, ఆ బడుద్దాయిల్ని సముదాయించి నమ్మించే సరికి నా తలప్రాణం తోక్కొచ్చింది.

ఆ ఫళంగా వాళ్ళు తెప్పరిల్లి, "అమ్మయ్యా, మా పేనాలు నిజంగా కాపాడినారం డయ్యగోరూ" అంటూ ఆనందంగా దమ్ము పీల్చుకుని రివ్వున లేచారు.

వాళ్ళతోపాటు నా ప్రాణంకూడా ఒక్కసారి అధోలోకంనుంచి లేచినట్టయింది. బోయీలు మళ్ళీ పల్లకీ నెత్తి పట్టుకున్నారు. ఆ గడ్డిబీట్లో పాం గందరగోళంతో ఓగంటసేపు పనవసరంగా నష్టమయింది. తిరిగి యిల్లు జేరుకునేప్పటికి ఠంగుఠంగు మని పన్నెండు కొట్టేసింది.

"అయినా దానికేంగాని మీరేం దిగులు పడకండి. మనసులో మధనపడకండి. నిన్న యే మహానుభావుడి మొహం చూసి లేచానో అన్ని పుర్రాకులు పడాలనుంది. పడ్డాను. అంతే. దాన్ని మీరు తప్పించగలరా? నేను తప్పించగలనా?— మనల్ని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడు తప్పించగలడా మరి!" అంటూ చిరునవ్వు ముక్తాయింపుతో ముగించాడు శరత్‌బాబు—

అంతలో నౌకరు టీ తెచ్చిపెట్టాడు. "తీసుకోండి. వేడివేడి టీ తాగండి" అంటూ శరత్‌బాబు వాళ్ళకి టీ యిచ్చి సాగనంపాడు.

('శరతేర్ బైటక్' కథ ఆధారంగా)